క్లుప్తంగా

ఏసీడీ చార్జీలు రద్దు చేయాలి



మాట్లాడుతున్న నందిరామయ్య

ఖానాపూర్: ప్రభుత్వం ఏసీడీ చార్జీల పేరుతో వినియోగదారులపై మోపే అదనపు భారం రద్దు చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి నందిరామయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో మాట్లాడారు. వినియోగదారులపై ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 31న అన్ని మండల కేంద్రాల్లోని విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అంకుశ్‌రావు, జక్కుల రాజన్న, ఎల్లయ్య, కె.రాజన్న, వర్మ, శ్రీనివాస్, మున్వర్, శంకర్, తదితరులు ఉన్నారు.

మద్యం తాగి నడుపొద్దు

దస్తురాబాద్: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని భుత్కూర్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సురేందర్, దయానంద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'గోదావరి'కి భీమన్న గదలు



వడ్యాల్ నుంచి నదికి వెళ్తున్న భీమన్న గదలు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్, రాచాపూర్ గ్రామాల్లో ఆదివారం ఉదయం భీ మన్న గదులు గంగస్నానానికి తరలివెళ్లాయి. ఆదివారం ఉదయం 11 గంటలకు ఆయా గ్రామాల్లోని భీమన్న ఆలయాల నుంచి భీమన్న గదలను మంగళహారతుల నడుమ గంగస్నానానికి తరలించారు. రాత్రి సమీపంలోని గోదావరి నదిలో అభిషేకం చేయించి సోమవారం ఆలయంలో ప్రతిష్ఠించి జాతర నిర్వహిస్తారు.

విరాళం అందజేత

కుంటాల: మండల కేంద్రంలోని కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ ఆలయాభివృద్ధికి పలువురు దాతలు ఆదివారం విరాళం అందించారు. ఉపాధ్యాయుడు సబ్బిడి నర్సయ్య ఎల్‌ఈడీ బల్బుల కోసం రూ.5వేలు, కూస భూమన్న రూ.5వేలు, డా.దిగంబర్, వెంకట్‌రావు, అశోక్ వేర్వేరుగా అమ్మవారికి ముక్కు పుడకలు బహూకరించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను సన్మానించారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: పట్టణంలోని కుంట ప్రాంతంలో షాదీఖానా నిర్మాణానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. రూ.45లక్షలతో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం



ఉట్టి కొడుతున్న మహారాజ్

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం ఆదివారం ముగిసింది. ఉదయం నిర్వహించిన కాల్యా కీర్తనంలో నాందేడ్ జిల్లాకు చెందిన తుకారాం మహారాజ్ మాండలికర్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలు వీడి భక్తి మార్గంలో నడవాలన్నారు. ఈసందర్భంగా పలువురు తులసీమాలలు ధరించారు. అనంతరం ఉట్టి కొట్టి ప్రసాదం పంపిణీ చేశారు. మండలంతోపాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల భక్తులు హాజరయ్యారు. అనంతరం మహారాజ్‌ను సన్మానించారు. వార్‌కరి భక్తులు పాల్గొన్నారు.

జగదాంబదేవి జాతర



పూజలు చేస్తున్న భక్తులు

మామడ: మండలంలోని జగదాంబతండాలో జగదాంబదేవి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు, పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

కరాటే శిక్షణతో ఆత్మరక్షణ

- ఆపదను ఎదుర్కొనేలా బాలికలకు తర్ఫీదు
- ఆకతాయిల పనిపట్టడమే లక్ష్యం
- పాఠశాలల్లో నెలరోజులపాటు కార్యక్రమం



జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న శిక్షకుడు



ఖానాపూర్ మండలం సత్తన్‌పల్లిలో శిక్షణ

మామడ: ఆపదలో ఆందోళన చెందకుండా పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొనేలా విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసంతోపాటు ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో మార్షల్ ఆర్ట్స్‌లో భాగంగా కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించింది. రాణిలక్ష్మీబాయి ఆత్మరక్షా ప్రశిక్షణ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులపై వేధింపు ఘటనలను నివారించి.. వారిని మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారు చేయడం దీని ఉద్దేశం. ప్రభుత్వం ప్రత్యేక శిక్షకులను నియమించడంతో ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపుల బారి నుంచి బాలికలు తమను తాము రక్షించుకునేందుకు.. ఈ కరాటే పాఠాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. దీంతో వారు మరింత ఆత్మవిశ్వాసం పెంచుకోవడంతోపాటు ఆరోగ్యవంతులుగా మారుతారు.

సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నెలరోజుల శిక్షణ

ఈనెల 24న బాలికల దినోత్సవం నేపథ్యంలో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నెలరోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. జిల్లాలోని పాఠశాలల విద్యార్థినులకు మార్షల్‌ఆర్ట్స్‌లో 30 రోజుల పాటు (ఫిబ్రవరి 23వరకు) శిక్షణ తరగతులు కొనసాగనున్నాయి.

జిల్లాలో 141 పాఠశాలల్లో..

జిల్లాలోని 107 ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 18 కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాలు, 16 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల నేపథ్యంలో మార్షల్ ఆర్ట్స్ శిక్షణను ఆరు నుంచి తొమ్మిదో తరగతి వారికి నేర్పిస్తున్నారు. జిల్లాలోని 141 పాఠశాలల్లో 40 మంది మార్షల్ ఆర్ట్స్ శిక్షకులు విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తున్నారు. ఒక్కో శిక్షకుడికి గౌరవ వేతనం నెలకు రూ.ఐదు వేలు అందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పాఠశాలల్లో నిర్వహిస్తున్న మార్షల్‌ఆర్ట్స్ శిక్షణను విద్యార్థినులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం. దీంతో వారు శారీరకంగా బలంగా మారి ధైర్యంగా ఆకతాయిలను ఎదుర్కొంటారు.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

శిక్షణతో ఆత్మవిశ్వాసం



జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. దీంతో ఆపదలో బాలికలు తమను తాము రక్షించుకునేలా శిక్షణనిస్తున్నాం. 141 పాఠశాలల్లో 40 మంది శిక్షకులు విద్యార్థినులకు నేర్పిస్తున్నారు.

–శ్రీదేవి, సెక్టోరియల్ అధికారిణి

అటెన్షన్ ప్లీజ్.. గుంతల రోడ్డుతో అవస్థలు



తానూరు: మండలంలోని బామ్ని బస్టాప్ నుంచి మహాలింగి గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 94408 36125

ప్రజల భద్రత కోసమే కార్డన్‌సెర్చ్

- ముధోల్ సీఐ వినోద్
- ఎనిమిది ఆటోలు, 72బైక్‌లు స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ వినోద్, పక్కన సిబ్బంది

తానూరు: ప్రజల భద్రత కోసమే పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ముధోల్ సీఐ వినోద్ అన్నారు. ఆదివారం మండలంలోని తొండాల గ్రామంలో తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐతోపాటు నలుగురు ఎస్సైలు, ఏఎస్సైలు, 70 మంది పోలీసులు ఇళ్ల ముందు నిలిపి ఉన్న వాహనాలు, కిరాణ దుకాణాలను తనిఖీ చేశారు. సరైన పత్రాల్లేని ఎనిమిది ఆటోలు, 72 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా సీఐ వినోద్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు విక్రమ్, తిరుపతి, మహేశ్, సాయికుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గ్రామదేవతల బోనాల పండుగ

- ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



నిర్మల్‌లోని వెంకటాద్రిపేట్ పోచమ్మ ఆలయంలో..



లక్ష్మణచాందలో చలిబోనాలు తీసుకెళ్తున్న మహిళలు

నిర్మల్‌చైన్‌గేట్: పుష్యఅమావాస్య నుంచి మాఘశుద్ధ పౌర్ణమి వరకు జరిగే చలిబోనాల పండుగను ప్రతీ ఆది, బుధవారాల్లో నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్, కురన్నపేట్, బుధవార్‌పేట్, ప్రియదర్శినినగర్, మరెమ్మగుడి, బంగల్‌పేట్, గాజుల్‌పేట్ అమ్మవారి ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. గ్రామస్తులంతా కలిసిమెలిసి సంతోషంగా ఉండాలని ఈ వేడుక నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, పిల్లలు, భక్తులు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో బోనాలు వండి నైవేద్యం సమర్పించారు. అర్చకులు శరత్‌చంద్రశర్మ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు.

సారంగపూర్: మండలంలోని జామ్, ఆలూరు, సారంగాపూర్, కౌట్ల(బి) తదితర గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతల బోనాల పండుగనిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం ముత్యాల పోచమ్మ, పొలిమేర పోచమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

లక్ష్మణచాంద: సోన్ మండలం కడ్తాల్, గంజాల్, పాక్‌పట్ల, మాదాపూర్ గ్రామాల్లో చలిబోనాల పండుగ నిర్వహించారు. శనివారం రాత్రి చలి బోనాలు తయారు చేసిన మహిళలు ఊరేగిపుగా వెళ్లి గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్, కనకాపూర్, లక్ష్మణచాంద, నర్సాపూర్, బాబాపూర్, బోరిగాం, న్యూకంజర్, తిర్పెల్లి, పీచర గ్రామాల్లో గ్రామదేవతలకు చలిబోనాలు సమర్పించారు.

కుంటాల : మండలంలోని కుంటాలలో ద్యావాలదండు అమావాస్య పురస్కరించుకొని శనివారం రాత్రి నైవేద్యం వండి ఆదివారం వేకువ జామున గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ వార్లకు నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



ఖానాపూర్: ఆలయం వద్ద భక్తుల సందడి

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకం హారతి, పల్లకిసేవలో భక్తులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

సారంగపూర్: బూత్ కమిటీ సభ్యులు గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కరిపె విలాస్ అన్నారు. మండలంలోని హనుమాన్‌తండా, కుప్టి, ఇప్పచెలిమ గ్రామపంచాయతీల్లో నూతన బూత్ కమిటీలను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గిరిజన మోర్చా అధ్యక్షుడు జాదవ్ వినోద్, రాథోడ్ ఉమేశ్, కార్యదర్శి సురేందర్, బూత్ కమిటీల అధ్యక్షులు ధన్‌రాజ్, జ్ఞానేశ్వర్, గణపతి, తదితరులు ఉన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్'

లక్ష్మణచాంద: రాష్ట్ర ప్రజలను సీఎం కేసీఆర్ అన్ని రకాలుగా మోసం చేస్తున్నాడని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. ఆదివారం సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలో ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బూత్‌స్థాయి కార్యకర్తలతో కలిసి తిలకించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చి సకాలంలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి దిగజార్చరన్నారు. కార్యక్రమంలో సోన్ మండలాధ్యక్షుడు మ్యాక ప్రేమ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి నారాయణ, సాయిరాం, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఖానాపూర్: హాజరైన పూర్వ విద్యార్థులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని సీఎంరావు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996–97 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులంతా సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను నెమరువేసుకుని రోజంతా సరదాగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు.

ముధోల్: శ్రీసరస్వతీ విద్యాపీఠం రాష్ట్ర పూర్వ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యారణ్య ఆవాస్‌లోని శ్రీ శారదాధామంలో పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం నిర్వహించారు. ముధోల్ సరస్వతీ శిశుమందిర్ పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. పూర్వ విద్యార్థి, విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు బండారి శ్రీకాంత్, కార్యదర్శి బొగ్గుల సురేశ్, ప్రధానోపాధ్యాయుడు సారథి రాజు, సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: నియోజకవర్గంలోని ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లోని రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఖానాపూర్ జలసాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఖానాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రేఖానాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సదర్మాట్ బ్యారేజీ ప్రత్యేక కాలువతోపాటు చివరి ఆయకట్టుతోపాటు డీ27, డీ28 కాలువలకు నీటిని అందించేలా చూడాలని విన్నవించారు. దస్తురాబాద్ మండలంలోని ఎర్రగుంట, అక్కొండపేట్ గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించాలని కోరారు. సునారికారి రాజేశ్, అల్లెపు పీటర్, సురేందర్, రమేశ్, పసుపుల వెంకన్న, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కడెం మండలానికి చెందిన ఎం.సత్తన్న ఆధ్వర్యంలో ఆదివారం పలువురు బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే రేఖానాయక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, రాజగన్న, పరిమి సురేశ్, ఆకుల వెంకాగౌడ్, బండారి కిశోర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్సై

దస్తురాబాద్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఎమ్మెల్యే రేఖానాయక్‌ను ఖానాపూర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తూ నేరాలను నియంత్రించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజునాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ రాజు, గోపి, గంగన్న పాల్గొన్నారు.

రేపు ఖానాపూర్ మండల సర్వసభ్య సమావేశం

ఖానాపూర్: పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఖానాపూర్ మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీవో బాలె మల్లేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలతోపాటు ఆయాశాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

విహారయాత్రకు రేవోజీపేట విద్యార్థులు

దస్తురాబాద్: మండలంలోని రేవోజిపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వెయ్యిస్తంభాల గుడి, భద్రకాళి అమ్మవారు, వరంగల్ పోర్టులను చూసేందుకు యాత్రకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పురోషోత్తంరెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు పాఠాలతోపాటు క్షేత్ర పర్యటనల ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వెంకటేశ్, ఉపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య, రవీందర్, సుమలత, సునేషా పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాలు ఎన్నిక



దస్తురాబాద్‌లో సన్మానిస్తున్న సభ్యులు



నిర్మల్‌లో సన్మానిస్తున్న సభ్యులు

దస్తురాబాద్: మండల కేంద్రంలో బీజేపీ ఓబీసీ మండల కమిటీని రాష్ట్ర అధికార ప్రతినిధి నర్సాగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా పోతుగంటి హన్మగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పిట్ల రాము, కోశాధికారిగా ముప్పిడి అనిల్, సభ్యులుగా మల్లేశ్, శ్రీనివాస్, వెంకమల్లు, సాయితేజ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు రాజేశం, శ్రీనివాసగౌడ్, బంగారు కిషన్, తిరుపతి పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్‌లో సహాయ వెల్ఫేర్ సొసైటీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు ఇర్ల సాయేందర్ అన్నారు. జిల్లా సెక్రెటరీగా రంజిత్‌గౌడ్, క్యాషియర్‌గా పోలా దయాకర్, గౌరవ అధ్యక్షులుగా అల్లం భాస్కర్, గోనె రాజును ఎనున్నకున్నట్లు పేర్కొన్నారు. వీరి పదవికాలం రెండేళ్లు ఉంటుందని.. నూతన కార్యవర్గాన్ని సభ్యులు, పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా నూతన కార్యవర్గం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పడాల రాజశేఖర్, ప్రకాశ్ తెలిపారు. మండలాధ్యక్షుడిగా పుప్పాల పవన్, ఉపాధ్యక్షులుగా మహేష్, మల్లేశ్, రవి, సాయి, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్, సాయికిరణ్, కార్యదర్శులుగా లక్‌పతి, లింబాద్రి, కృష్ణ, నాగరాజు, కోశాధికారిగా భీమన్న, సభ్యులుగా నర్సయ్య, వరుణ్, మహేందర్, మహేశ్, హన్మంతు, మల్లేష్, తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

పీపీకి సన్మానం

ఖానాపూర్: జిల్లా ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఈనెల 26న అవార్డు అందుకున్న కల్వకుంట్ల వినోద్‌రావును పట్టణంలోని తన నివాసంలో స్థానిక నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. చైర్మన్ అంకం రాజేందర్, న్యాయవాదులు వెంకట్‌మహేంద్ర, షబ్బీర్‌పాషా, నాయకులు రాజశేఖర్, ప్రతాప్‌రావు, సాబీర్, సాయి తదితరులు ఉన్నారు.

'ఎమ్మెల్యే తీరు సరికాదు'

నిర్మల్‌టౌన్: బీసీ కుటుంబానికి చెందిన జగిత్యాల మున్సిపల్ చైర్మన్ బోగ శ్రావణిని.. అక్కడి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మానసిక వేదనకు గురిచేయడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేకు బీసీలే బుద్ధి చెబుతారన్నారు.

ఎఫ్‌సీఐ సభ్యుడికి సన్మానం

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యుడు సమత సుదర్శన్‌ను దళిత బహుజన సంఘాల నాయకులు సన్మానించారు. ఈకార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర కోకన్వీనర్ సుంకేట పోశెట్టి, గంగపుత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల సాహేందర్, నల్ల రవి, భూమన్న, దేవిదాస్ ఉన్నారు.

సన్మానం

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్‌ని అంబేద్కర్ సంఘం నాయకులు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దడిగే భోజన్నను ఆదివారం సన్మానించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు భూపతి, రాజన్న, రాములు, భూమన్న ఉన్నారు.

సేవలతోనే గుర్తింపు

కుంటాల : ఉత్తమ సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఏఈ శివకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కల్లూర్ సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న సబ్ ఇంజినీర్ వంశీకుమార్ ఇటీవల ఉత్తమ ఉద్యోగిగా ఎంపికవగా ఆదివారం వారిని సన్మానించారు.

ఆలయంలో చోరీ



ఆవరణలో పరిశీలిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ప్రధాన హుండీ తెరుచుకోకపోవడంతో దుండగులు మరో హుండీని ధ్వంసం చేశారు. అందులోని సుమారు రూ.40వేల విలువైన కానుకలు అపహరణకు గురైనట్లు ఆలయ ఈవో రవికిషన్‌గౌడ్ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఆదివారం డీఎస్పీ జీవన్‌రెడ్డి, నిర్మల్ రూరల్ సీఐ వెంకటేశ్, ఎస్ఐ గీత క్లూస్‌టీంతో పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దుండగులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.